

## పార్లమెంట్‌లో పటిష్ట చట్టం చేయాలి

కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై అత్యాచార, హత్య ఘటన అత్యంత హేయమైన చర్య. మధ్య తరగతి కుటుంబాల నుంచి ఎన్నో కలలతో కష్టపడి వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. డాక్టర్లకు పనిచేసే ప్రాంతంలోనే భద్రత లేకపోతే ఎలా ముందుకు సాగుతాం. కేంద్ర స్థాయిలో డాక్టర్ల రక్షణ కోసం పటిష్టమైన చట్టాన్ని తీసుకురావాలి. బాధిత డాక్టరు కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలి.

-డాక్టర్ అనుపమా, శీతనపల్లి పీహెచ్‌సీ, కైకలూరు మండలం



## డాక్టర్ల ప్రాణాలకు రక్షణ కల్పించండి

రోగుల ప్రాణాలను కాపాడుతున్నాం. డాక్టర్ల ప్రాణాలకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటన దారుణం. పనిచేసే ప్రాంతాల్లో డాక్టర్లకు రక్షణ లేదు. బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఒక్కో సందర్భంలో రోగి బంధువులు డాక్టర్లపై దౌర్జన్యం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర స్థాయిలో ప్రత్యేక చట్టం తీసుకొచ్చి డాక్టర్లకు రక్షణ కల్పించాలి.

- డి.ప్రశాంతి, ప్రముఖ కంటి వైద్య నిపుణులు, కైకలూరు



# గుంతలమయంగా రోడ్లు



శ్రీరంగపురం వద్ద కుంగిన రహదారి



రాళ్లు తేలిన వీరంకిలాకు-కూచిపూడి రోడ్డు



అధ్వానంగా మారిన పమిడిముక్కల-మేడూరు రోడ్డు

**పమిడిముక్కల:** మండలంలోని పలు ఆర్‌అండ్‌బీ రహదారులు ప్రమాదకరంగా మారాయి. వీరంకిలాకు నుంచి అగినపర్రు మీదగా కూచిపూడి వెళ్లు రోడ్డు, వీరంకిలాకు-ఫత్తేలంక, కృష్ణాపురం-కూచిపూడి, కృష్ణాపురం-ఐలూరు, కృష్ణాపురం-లంకపల్లి, కూడేరు-ఐనపూరు, పమిడిముక్కల-మేడూరు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం పడితే గుంతల్లో నీరు చేరడంతో రహదారి కనబడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. శ్రీరంగపురం, బొడ్డువానిగూడెం వద్ద రహదారి కుంగిపోయింది. కూడేరు శివారు నమ్మితాలగుంట, కపిలేశ్వరపురం-ముత్రాసిపాలెం, మామిళ్లపల్లి-గంద్రపువాని గూడెం జెడ్పీ రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. వర్షం పడితే ఈ రబ్బీష్ రోడ్లన్నీ బురదమయంగా మారతాయి. దీంతో ఈ రోడ్లపై కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిగా దెబ్బతిన ఈ రహదారులపై నుంచి బస్సులు నడపడం కష్టంగా ఉందని ఆర్టీసీ డ్రైవర్లు చెబుతున్నారు. మండలంలోని 15 గ్రామాల ప్రజలు ఈ ఏడు రహదారులపై నుంచే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రహదారులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### రహదారులను అభివృద్ధి చేయండి



మంటాడ-లంకపల్లి ప్రధాన రహదారి కృష్ణాపురం నుంచి చోరగుడి వరకు గుంతలమయంగా మారింది. పలుచోట్ల కుంగిపోయింది. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని పలు రహదారుల పరిస్థితి కూడా అలాగే ఉంది. రహదారులను వెంటనే అభివృద్ధి చేయాలి.

– మర్రి దుర్గారావు, ఎంపీటీసీ సభ్యుడు, చోరగుడి

### గుంతలు పూడ్చేందుకు చర్యలు

మండలంలోని మంటాడ-లంకపల్లి, కూడేరు-ఐనపూరు రహదారుల గుంతలు పూడ్చేందుకు ఎన్నికల ముందు నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచాం. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. మిగిలిన రహదారులకు అంచనాలు రూపొందించి పంపించాం. నిధులు మంజూరు కాలేదు.

– మల్లికార్జున, ఏఈ, ఆర్‌అండ్‌బీ

# ఘనంగా గంగానమ్మ జాతర



ఉనికిలిలో గంగానమ్మ జాతర నిర్వహిస్తున్న దృశ్యం



కైకలూరు బైపాస్ రోడ్‌లో గంగానమ్మ జాతరకు వచ్చిన భక్తులు



శ్రీహరిపురం గంగానమ్మ జాతరలో పాల్గొన్న భక్తులు

**మండవల్లి:** మండలంలోని ఉనికిలిలో మూడవ శ్రావణ ఆదివారం గ్రామస్తులు గంగానమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగానమ్మ అమ్మవారికి పసుపు కుంకుమలతో భక్తిశ్రద్ధలతో అభిషేకాలు చేశారు. వేడి చల్ది నైవేద్యాలు సమర్పించారు. ఆనందోత్సాహాలతో గంగానమ్మ, పోతురాజు ప్రతిమలను పుర వీధుల్లో ఊరేగించారు. డప్పు, వాయిద్యాలకు అనుగుణంగా యువకులు చేసిన నృత్యం చూపరులను ఆకట్టుకుంది. మాజీ సర్పంచ్ కారే వెంకటలక్ష్మి, కమిటీ సభ్యులు కారే ధర్మారావు, గెడ్డం కొండలరావు, ఫణీంద్ర, నాగేంద్ర, పరంజ్యోతి, బ్రహ్మం, కుర్మా కొండలరావు పాల్గొన్నారు.

**కైకలూరులో..**

**కైకలూరు:** శ్రావణమాసం సందర్భంగా కైకలూరు బైపాస్ రోడ్ ప్రారంభంలోని గంగానమ్మ ఆలయం వద్ద జాతర ఆదివారం అట్టహాసంగా జరిగింది. వెలంపేటకు చెందిన భక్తులు అమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. జాతర నిర్వాహకులు తులసి పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు గ్రామ జాతర జరుగుతోందన్నారు. 29న అభిషేకాలు, నైవేద్యాల సమర్పణ, 30న చల్ది నైవేద్యాలు, పూజలు సెప్టెంబర్ ఒకటో తేదీన అమ్మవారి జాతర, వేడి నైవేద్యాలు, గ్రామోత్సవం జరుగుతోందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. జాతర నిర్వాహకులు జె.ఆంజనేయులు, ఎస్.మణికంఠ, శివకుమార్, సుధీర్ పాల్గొన్నారు.

**ముదినేపల్లిలో..**

**ముదినేపల్లి రూరల్:** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గంగానమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుని ఊరేగింపులు జరిపారు. శ్రీహరిపురం క్యాంపుబెల్ కెనాల్ సమీపంలోని అమ్మవారి ఆలయం వద్ద జరిగిన సంబరానికి భక్తులు పోటెత్తారు. భక్తులు ఒకరిపైఒకరు గులాములు చల్లుకుంటూ గ్రామంలో కనకడప్పులతో ఊరేగింపు జరిపారు. ఇతర గ్రామాల్లో జరిగిన సంబరాల్లో భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

# ప్రతి మహిళా లక్షాధికారి కావాలి



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేసిన ఐకేపీ ఏపీఎం తిరుపతి రావు

**పామర్రు:** ఎవరైతే నెలసరి ఆదాయం రూ.10వేల కన్నా తక్కువగా ఉంటుందో వారిని లక్షాధికారి చేయాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ ఆదేశాలతో 'లఖ్ పతి దీదీ' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం తిరుపతిరావు పేర్కొన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో మహిళలకు శిక్షణ తరగతులను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలో ఉన్న మహిళలు వారి సంఘంలోని పొదుపుల నుంచి అంతర్గత రుణాలు నిర్వహించుకుంటూ, బ్యాంక్ నుంచి లింకేజీ రుణాలు తీసుకుని వారి కుటుంబం వివిధ రకాలుగా జీవనోపాది సాగిస్తున్నారన్నారు. రూ.10వేల ఆదాయం కన్నా తక్కువ ఆదాయం ఉన్న వారిని గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు, జీవనోపాధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసిన సభ్యులను సర్టిఫికెట్లను అందజేశారు.

# ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న యూటీఎఫ్ నాయకులు

**గుడివాడ టౌన్:** ఆంధ్రప్రదేశ్ ఐకోపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక ఏజీకే మున్సిపల్ హైస్కూల్లో ఆదివారం డివిజన్ స్థాయిలో రెండు విభాగాల్లో 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్, జావలింగ్ త్రో, షటిల్ బ్యాడ్మింటన్, స్లో సైక్లింగ్, వాలీబాల్, మహిళల విభాగంలో క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలైన టీమ్‌లు, వ్యక్తులు జిల్లా పోటీలకు అర్హులని పేర్కొన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో అవనిగడ్డలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతలైన వారు అక్టోబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకరరావు, కార్యదర్శి జి.ఎ.వరలక్ష్మి, ఈడె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# పారిశుధ్యం పాతర

### రోగాల బారిన ప్రజలు



పామర్రు వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళ

**పామర్రు:** పామర్రులో పారిశుధ్యం పడకేసింది. పలు కాలనీల్లో దోమల ఉధృతి వలన ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. గ్రామంలో ఎక్కడ చెత్త అక్కడే అనే విధంగా ఉంది. స్థానిక 14,15,16 వార్డులతోపాటు పలు ప్రాంతాల ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. అంతే కాకుండా కలుషిత నీటిని తాగి డయేరియా లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరి వైద్య సేవలు పొందుతున్నారు. కొత్తపేటకు చెందిన నలుగురు డయేరియాతో ఎస్-2 ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాపూజీ పేటకు చెందిన ఏడుగురు జ్వరాలతో బాధపడుతున్నారు. వీరితో పాటు ధనాల నాగేశ్వరరావు, మంచాల రాము, వెన్నా లక్ష్మీకుమారి, బయలపాటి శిరీష విజయవాడ, మచిలీపట్నంలలోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం డెంగీ, వైరల్ ఫీవర్ గ్రామాలలో విజృంభించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి**

గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. తాగునీటికి పరీక్షలను నిర్వహించి, సురక్షిత తాగునీరు ప్రజలు అందించేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటికైనా వైద్యశాఖ అధికారులు స్పందించి గ్రామాల్లో జ్వరాలు, విరోచనాలు, వాంతులతో బాధ పడుతున్న వారిని గుర్తించి, ఆయా ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులను నిర్వహించి బాధితులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



పామర్రు 16వ వార్డులో చెత్తతో పూడుకు పోయిన డ్రెయిన్



పామర్రు 13వ వార్డులో చెత్త కుండీ వద్ద పేరుకుపోయిన చెత్త

### నేటి నుంచి ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవాలు

**జమీదగ్గుమిల్లి(పామర్రు):** పామర్రు మండలం జమీదగ్గుమిల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగానమ్మతల్లి ఆలయ పునః ప్రతిష్టా మహోత్సవాలను సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 27వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు గంగానమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహం, వినాయక విగ్రహం, నాగబంధం, పోతురాజు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నారు. కళావాహన, పూర్ణాహుతి అనంతరం వచ్చిన భక్తులు అందరికీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### కృష్ణాష్టమికి ముస్తాబు



**మండవల్లి:** మండవల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణాలయం కృష్ణాష్టమికి ముస్తాబైంది. గతంలో ఉన్న ఆలయం శిథిలమవడంతో ఇటీవల యాదవ ప్రముఖులు ఆలయాన్ని నిర్మించారు.ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు కాంతులీనుతున్నాయి. కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం పురవీధుల్లో స్వామిని ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### సత్యనారాయణకు మదర్‌థెరిస్సా సర్వీస్ అవార్డు

**కైకలూరు:** ఎక్స్ రే లిటరరీ కల్చరల్ సర్వీస్ ఆర్గనైజేషన్, విజయవాడ ప్రతిఏటా అందించే మదర్‌థెరిస్సా సర్వీస్ అవార్డుకు కైకలూరుకు చెందిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రీజియన్-4 చైర్మన్ కొండ్రెడ్డి వెంకట సత్యనారాయణ ఎంపికయ్యారు. ఈ అవార్డును మదర్‌థెరిస్సా జయంతి సందర్భంగా విజయవాడ గాంధీనగర్‌లో హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం సాయంత్రం 6.30 గంటలకు ప్రముఖుల చేతుల మీదుగా అందజేయనున్నారు.

### అపరిచిత వ్యక్తులు కన్పిస్తే సమాచారం ఇవ్వాలి



టిడ్కో సముదాయం వద్ద కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ చంటిబాబు

**గుడివాడరూరల్:** అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా ఎవరైనా టిడ్కో గృహాల సముదాయం వద్ద సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్. చంటిబాబు కోరారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు టిడ్కో సముదాయం వద్ద ఆదివారం కార్డన్‌సెర్చ్‌ను పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ టిడ్కో గృహాలను తనిఖీ చేశామన్నారు. పాత నేరస్తులు, ట్రైబల్ మంగర్స్, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామన్నారు. మాదకద్రవ్యాలు నియంత్రణ, మద్యం అక్రమ రవాణా నివారణ, పాత కేసుల్లో నిందితుల ఇళ్లల్లో విస్తృత తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 33 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

# స్పీడ్ బ్రేకర్లుగా మూగజీవాలు



కైకలూరు రైతుబజారు వద్ద రహదారిపై అడ్డంగా తిష్ట వేసిన పశువులు

**కైకలూరు:** పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిపై కైకలూరులో సంచరిస్తున్న మూగజీవాలు వాహనదారులకు స్పీడ్ బ్రేకర్లుగా మారుతున్నాయి. నెలలో అనేక సందర్భాల్లో వీటి బారిన పడి ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. కైకలూరులో కొంత మంది ఆవులను ఉదయం పాలు తీసుకుని రోడ్లుపైకి విచ్చలవిడిగా వదులుతున్నారు. ప్రధానంగా రైతుబజారు, సంతమార్కెట్, అడవి నాయుడు, శీతయ్య హోటల్స్, తాలూకా సెంటర్లలో వీటి సంచారం అధికంగా ఉంది. అడ్డువచ్చిన ఆబోతులను వాటిని తప్పించే క్రమంలో తరుముతుంటే కొమ్ములతో వాహనదారులపై దాడి చేస్తున్నాయి. నిర్లక్ష్యంగా పశువులను విడిచిపెడుతున్న యజమానులకు పంచాయతీ అధికారులు నోటీసులు పంపించాలని ప్రజలు కోరుతున్నారు. కైకలూరు పంచాయతీ సెక్రటరీ ఆదిరాజు వెంకటేశ్వరరావును పశువుల సంచారంపై వివరణ కోరగా పరిష్కారమార్గాలను ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

# కొనసాగిన సుబ్బారాయుడి పవిత్రోత్సవాలు



పట్టుపవిత్రాల సమర్పణలో సుబ్బారాయుడు



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న ప్రధాన అర్చకుడు

**ముదినేపల్లి రూరల్:** ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పవిత్రోత్సవాలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామికి వాస్తుహోమం, వాస్తుబలి, మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో పలువురు వేద పండితులు స్వామి, అమ్మవార్లకు పట్టుపవిత్రాలు సమర్పించారు. సాయంత్రం ప్రధాన హోమాలు, ఆలయ బలిహరణ కార్యక్రమాలు జరిగాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామి, అమ్మవార్ల మాస కల్యాణం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య తెలిపారు.

# ఇనుప చెత్త కుండీల ఏర్పాటు



కైకలూరు ప్రభుత్వాస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన చెత్తకుండీ

**కైకలూరు:** మాతా స్కూల్ డైరెక్టర్ థామస్ రూ.44వేల సాయంతో కైకలూరు పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఇనుప చెత్త కుండీలను అమర్చారు. ప్రధానంగా పోస్టాఫీసు, బైపాస్ రోడ్, పెద్ద మసీదు, ప్రభుత్వాస్పత్రుల వద్ద వీటిని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి మాట్లాడుతూ చెత్తకుండీల ఏర్పాటునకు ముందుకొచ్చిన మాతా స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ప్రజలు రోజువారి చెత్తను కుండీలలో మాత్రమే వేయాలని కోరారు.



## క్లుప్తంగా

### కొండలమ్మకు మొక్కుల సమర్పణ



**గుడ్లవల్లేరు:** వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలోని క్యూలో భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్ తగు ఏర్పాట్లు చేశారు.

### శ్రీ కనక దుర్గాదేవికి భక్తుల నీరాజనాలు



**గుడ్లవల్లేరు:** కౌతవరం ఒకటో వార్డు నెయ్యల వారి శ్రీ కనక దుర్గాదేవి అమ్మవారి వార్షికోత్సవ సంబరాలు ఆదివారం కనులపండువగా నిర్వహించారు. చిత్ర విచిత్ర దేవతా వేషధారణలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపును కొనసాగించారు. స్థానిక యువ కళాకారుల నవగ్రహాల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారికి టెంకాయలు, పళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకుని దర్శించుకునేందుకు రోడ్ల వెంబడి భక్తులు బారులు తీరారు. అమ్మవారి ప్రభను కనకడప్పుల వాయిద్యాలు, బాణసంచాతో కౌతవరం, గుడ్లవల్లేరులోని పురవీధుల్లో ఊరేగించారు.

### శాంత రథం ఏర్పాటుకు దాతలు సహకరించాలి

**పామర్రు:** పామర్రు మానవత సంస్థ ఆధ్వర్యంలో ఉన్న పాత శాంతి రథం పూర్తిగా పాడైపోవడంతో దాని స్థానంలో కొత్త రథం కొనుగోలుకు దాతలు సహకరించాలని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి శీతాల ప్రసాద్ కోరారు. స్థానిక మానవత కార్యాలయంలో సభ్యులతో ఆదివారం సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామర్రు శ్మశాన అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న స్థలంలో మానవత కార్యాలయం ఏర్పాటు చేయాలని తీర్మానించామన్నారు. పామర్రు రీజియన్ చైర్మన్ పీఎంఎస్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మానవత కార్యవర్గ ప్రతినిధులు సోమశేఖర్‌రావు, త్రివిక్రమరావు, పీబీ శ్రీనివాస్, కొల్లా శ్రీనివాసరావు, నరసింహారావు, సుధాకర్ పాల్గొన్నారు.

### దాతల సేవలు అభినందనీయం

**కైకలూరు:** పేదలకు అన్నదానం చేయడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు అన్నారు. కైకలూరు తాలూకా సెంటర్ వద్ద అన్న క్యాంటిన్ దాతల సాయంతో పేదలకు అందిస్తున్న ఉచిత భోజన కార్యక్రమం ఆదివారానికి 68వ రోజుకు చేరింది. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి అద్దంకి శ్రీనివాసరావు, సోదరుడు శివనాగేశ్వరరావు వారి మాతృమూర్తి అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థం 400 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అద్దంకి వెంకట రాజేష్, విజయ్ ప్రశాంత్, కూటమి నేతలు పాల్గొన్నారు.

### పమిడిముక్కల ఎస్‌ఐగా కృష్ణ

**పమిడిముక్కల:** పమిడిముక్కల ఎస్ఐగా బి.కృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బొమ్మూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ నందివాడకు బదిలీపై వెళ్లారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఎస్ఐ తెలిపారు.

**కైకలూరు రూరల్ ఎస్సైగా రాంబాబు**

**కైకలూరు:** కైకలూరు రూరల్ ఎస్సైగా వి.రాంబాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అత్తిలి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన పి.రామకృష్ణ కాకినాడ జిల్లా కోట నందూరు స్టేషన్‌కు వెళ్లారు. తొలుత ఎస్ఐకు సిబ్బంది స్వాగతం పలికారు.

### ప్రత్యేక పూజలు



**కైకలూరు:** శ్రీకృష్ణాష్టమి సందర్భంగా వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో శ్రీరాధాకృష్ణ మందిరంలో జరిగిన పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదివారం పాల్గొన్నారు. మందిరం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కరేటి రాంబాబు, మడక శీను, మందిరం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.